
# అత్తారింటికి దారి...

- ఐ. కవిత



మరీ రాత్రయిపోలేదు కానీ-

చీకటి మాత్రం పడిపోయింది.

అలసిపోయినట్లు మెల్లిగా అడుగులు వేస్తోంది సుజాత.

పూర్వకాలపు వీధేమో - యిళ్లకి అరుగులు. వాటిమీద వీధి దీపాల కాంతి.

"ఇల్లలికి...

ముగ్గేసి

పీట వేసి, కంచం పెట్టి...బువ్వెట్టి...పప్పేసి...కూరేసి... పులుసేసి...పెరుగేసి...గోరుబువ్వ...ఆం...గోరు ముద్ద ఆమ్...ఆమ్...ఆమ్..." పాతకాలపు పాటకు వొళ్లు పులకరించినట్లయి - సుజాత ఆగిపోయి... అటుచూసింది - తన చిన్నప్పుడు అమ్మ తననీ అలాగే పాటలతో మురిపిస్తూ మరిపిస్తూ బువ్వ తినిపించి ఉంటుందను కుంటూ.

ఆ అరుగు మీద-

వయసు నిండి... వొడలు పండిన ఓ బామ్మగారు.

ఆవిడ వడిలో- ఏడాది వయసైనా నిండని ఓ పాప.

ఆవిడ ఓపికగా ఆ పాప చేత బువ్వ తినిపిస్తున్నారు.

ఆ దృశ్యం చూడముచ్చటగాను మనసుకి హాయిగానూ ఉంది. మధురమైన బంధం వేసినట్లామె ఆగిపోయింది. నిలబడిపోయింది.

బొబ్బపోసి...

చీరకట్టి...

పూలెట్టి...

గొలుసేసి...

అత్తారింటికి దారేదంటే... దారేదంటే... అంటే...అంటే..."

పాటపాడుతూ బామ్మగారు చక్కిలిగింతలు పెడుతు న్నారేమో - ఆ పాప - కిలకిల కిలకిల... పకపక పకపక ఒకటే నవ్వు. ఆనందంగా... అందంగా... ఒకటే నవ్వు. ఐతే-

సుజాతకి - బామ్మగారీ చరణం అందుకునేసరికి - అంతవరకూ మధురంగా ఉన్న మనసు కాస్త చేదుతిన్నట్లే ఐపోయింది.

అమాయకత్వం నిండిన ఆ పసిపాప మీదా- వొక్కసారి జాలేసింది. బామ్మగారు ఆచరణం వొదల డంలేదు. "అత్తారింటికి దారేదంటే...అంటే..." పాప నవ్వుల దొంతరలు...

వెనుకటి తరం బామ్మగార్లలాగా వెనుకటి తరం పాట పాడుతూ రేపటి తరం పాపను నవ్వుల బండిని చేసి పరుగెత్తిస్తూంటే-

సుజాత యిక నిగ్రహించుకోలేక పోయింది.

ఒక్కసారి - చాలా ఆవేశమూ ఉద్రేకమూ ఆమె నావహించాయి. మరుక్షణం వాళ్ల మధ్యకు వెళ్లి...

ఎదురుగా నిలబడి...

"బామ్మగారూ! మీరతిమంచివారు. మీది మహామంచి మనసు. మీకు మనుషులలోనూ ప్రపంచం లోనూ అంతా మంచే తప్ప మరేమీ కనపడదు అది - మీ పూర్వజన్మ పుణ్యం. అందుకే... ఆ మంచి బుద్ధితోనే పసిపాపకు అంత నిర్మలంగా నిష్కల్మషంగా అతి సులభంగా అత్తారింటికి దారి చూపించ గలుగు తున్నారు. కాని - వాస్తవమూ ప్రపంచమూ మహాచేదు. కాలకూట విషం. ఓ చిట్టి పాపా! చిన్నారి పాపా! ఇప్పటి నుంచే అత్తారింటి మీద ఆశల దొంతరలు పెట్టేసుకుంటే.. కలల పొగులు పెంచేసుకుంటే ఆనక నీకు అవమానాలు

ఆశాభంగాలూ అశ్రువులే మిగలవొచ్చు అలా జరగాలని నా అభిమతం కాదు. జరుగుతుందేమో అని జడుపు. ఎందుకంటే యీ రోజుల్లో ఆడజన్మంటే ఆదినుండి అంతంవరకూ అవమానాలూ అగ్ని పరీక్షలే మరి. చూడు... నేనూ నీలాటి మధ్యతరగతికి చెందిన అమ్మాయినే. అందుకే నీకు నా కథా నేను తెలునుకున్న చేదునిజమూ చెబుదామని.

"చూస్తున్నావుగా నన్ను? కొంచెం అందమయిన దానినే తప్ప అనాకారిని కాదు కదా? చదువుకున్నదానినే కాస్తో కూస్తో. డిగ్రీ అన్న మాట. చిన్న ఉద్యోగమూ చేస్తున్నాను. పెళ్లీడే అని నా ముఖం చెబుతూనే ఉందిగా. విచిత్రమూ అతి దయనీయమూ అయిన విషయమేమిటంటే - నా నంపాదనతో నంసారానికి సహకరిస్తున్నా అమ్మా నాన్నలకి నేను బరువునీ భారాన్నే! ఎందుకో తెలుసా? నేనీడు పిల్లనని! ఆడపిల్లంటే ఏమనుకున్నావ్? మహలక్ష్మి... ఇంటికి దీపం... అలా గనుకోకు. అసలు నిజం ఆకళింపు చేసుకో. పెళ్లికాని ఆడపిల్లంటే - అమ్మా నాన్నలకు గుండెల మీద కుంపటి! పక్కలో బల్లెం. అక్కరలేని అతిథి. భరించలేని బంధువు. అందుకే... నన్ను వాళ్లింటి నుంచి ఎంత తొందరగా సాగనంపేస్తామా అని వాళ్లకెంతో ఆత్రుత. ఆరాటం. గుదిబండలా నన్నెంత త్వరగా వొదుల్చుకో గలమా అని వాళ్లకి నిరంతరమూ తహతహే. నన్ను భరించే మగవాడంటూ దొరికితే పదిహేను వేలో యిరవైవేలో యివ్వడానికి కూడా సిద్ధంగా ఉన్నారు!

పోనీ... ఏదో వొకలా. ఎవరో వొకరితో... నా పెళ్లయిందే అనుకో. ఇల్లలకగానే పండగయిందా? ఉహుం... ముందే ఉంది మునళ్ల పండగ. ఆ ముప్పేమిటంటావా?

ఆడపిల్ల బతుకు బండలూ బందికానా కావటం పెళ్లితోనే ప్రారంభ మౌతుంది. తాళికి వొంచిన తల మరి ఎత్తుకోగలిగేది చితిమీదనే. ఆ చితి ఎప్పుడనేది లలాట లిఖితం కాదు.

పెళ్లిలో యిచ్చిన కట్నం చాలదని... యింకా డబ్బు నంచులు పుట్టింటి నుంచి తరలించుకు రమ్మని ఆయనో అత్తగారో చీటికీ మాటికీ తరిమేస్తూండవొచ్చు. అలా తేలేక పోతే... ఎలా తేగలను? నాన్నగారు నాకు పెళ్లి చేసి అత్తారింటి కంపడానికే ఉన్నదంతా ఊడ్చేసుకుని...పుట్టినన్ని అప్పులూ చేసేసి నెత్తిన చెంగేసేసుకుంటారు! ఈ ఆడపిల్ల నెత్తిమీద- మంచి ముహూర్తం చూసి - డబ్బాడు కిరననాయిలు పోసి... ఓ అగ్గిపుల్ల అంటించి జీవితానికి అంతిమ గీతం ఆలపించేసి గోడకి ఫోటో ఎక్కించేసి దండేస్తారు. పోనీ... నేనదృష్టవంతురాలిననీ... వాళ్లంత నీచమయిన డబ్బు మనుషులు కారనీ అనుకున్నా... కళ్యాణమయ్యాక కనక తప్పదు కదా?

"కాలమెలా మండిపోతోందని? ఇప్పుడందరికీ ఆడపిల్లలంటే అలునూ అక్కర లేనిదీ. అమ్మాయి పుడితే రుణం, అబ్బాయి పుడితే ధనం. పుట్టబోయేది అమ్మాయే అని తెలిసిందో భ్రూణహత్యలకు కూడా వెనకాడని బ్రహ్మారాక్షసులతో నిండిపోయింది ప్రపంచం. కనడం వరకే తప్ప కావాలని మగపిల్లాడినే కనడం అసాధ్యం మానవాతీతమూ కద! ఈ విషయంలో స్త్రీ పురుషులిద్దరూ నిస్సహాయులే. విధి వక్రించి - ఆడపిల్ల పుట్టిందనుకో. ఆవిడ గతి యిక... అంతే సంగతులు. ఆ నెపమో యీ నెపమో పెట్టి - ఆడపిల్లను కన్న నేరానికా యిల్లాలిని యింటి నుంచి బయటకు గెంటేసే ప్రబుద్ధులూ తక్కువేమీ లేరీప్రపంచంలో. సరే. దేముడు చల్లగా చూసి... దైవం కరుణించి... ఈ గట్టూ ఎక్కామే అనుకో. ఐనా ఆడబతుకు తెరిపినా పడదు, సుఖంగా తెల్లారనూ తెల్లారదు. ఎందుకంటావా?

"ఈ వ్యవస్థలో - మొగుడంటే మొగాడూ, మొగాడంటే మగ మహారాజూ. ఆ మహారాజు కేవలమూ సుఖపడడానికే జన్మిస్తాడు! కనుక అతగాడు సిగరెట్లు... తాగుడు... పేకాట... బారులు... క్యాబరేలు... అన్ని విలాసాలనూ అనుభవిస్తూంటాడు. సకల కళాభిరాముడై శోభిల్లుతూంటాడు. కొందరయితే చిన్నిల్లు కూడా ఏర్పరచుకుంటారు. ఆడపిల్లనే శనిని వొదుల్చుకుందు కామె తల్లితండ్రులు వేల కొద్దీ కట్నం దానం చేసుకుంటారుగా బలవంతంగా. చిత్తంకొద్దీ చిన్నెలూ విత్తం కొద్దీ వన్నెలూ... అర్థమూ ఆరోగ్యమూ ఉన్నన్నాళ్లూ అర్ధాంగి సంగతి విస్మరించి - తుమ్మెదలా ఆ పువ్వు మీదా యీ పువ్వు మీదా విహరిస్తారు. కట్టుకున్న ఆడది - పెట్టుకున్న బానిస కంటె భిన్నంగా కనిపించదు జల్సాసాగినంత కాలం. కాని - నేటి వ్యసనవిలాసాలు రేపటి వ్యాధులు కదా? అనారోగ్యంతో మంచమెక్కుతాడు. అతను బాగున్నన్నాళ్లూ మనని బానిసలాగే చూసినా ఆ భర్తగారిని కిమ్మనకుండా మనం చచ్చినట్లు కాపాడుకొని తీరాలి. మనసులో ఉన్నా లేకపోయినా సర్వసేవలూ చేసి మన మాంగల్యం కాపాడుకోడం కోసం వారిని బతికించుకు తీరాలి. లేదంటే- ఆడవాళ్లకి వివాహం కాకపోవడం కంటె వికృతమైన శిక్ష వైధవ్యం - యింతనాగరికత ప్రబలిన నేటి ప్రపంచంలో కూడా.

కనుకనే మగాడు ఆడదాని జీవితం మీదా సుఖాల మీదా అభిమానం మీదా ఎన్నెన్ని దెబ్బలు కొడుతున్నా అతను చస్తే బాగుండుననుకునే వీలు లేదాడవాళ్లకి. పాతివ్రత్యం పేరిట ఆవిడని పరాధీనురాలిని చేసి వొదిలిందిగా పురుషలోకం! సుకుమారీ... అబలా... అంటూ ఆమెను మానసికంగానూ శారీరకంగానూ కూడా తరతరాలుగా బలహీనురాలిని చేస్తూ వొచ్చిందిగా?

ఏమిటీ అమ్మాయి యిలా చెబుతోందనా ఆశ్చర్యంగా చూస్తున్నారు? ఇది మీకు ఆశ్చర్యకరం కావొచ్చు కానీ బామ్మగారూ - అతి చేదునిజం.

నేను చూస్తున్న మధ్యతరగతి కుటుంబాలలో...

చదివే వాస్తవిక నవలలలో...

వింటూండే మాటలలో...

తిలకించే ప్రపంచంలో...

ఆడకథ అచ్చంగా యిలాగే ఉంటోంది...

ఇంతకంటె కొంచెమేనా మెరుగు పడుతుందన్న ఆశామృగ్యమై పోతోంది దినదినానికి. స్త్రీ జీవితానికి సమీప భవిష్యత్తులో మంచి మలుపు ఎదురౌతుందని అనుకునేందుకు లేకపోతోంది. అందుకే-

అసలు - పెళ్లే చేసుకోకుండా - ఎప్పటికీ అమ్మా నాన్నల దగ్గర హాయిగా ఉండిపోదామనుకుంటాను - యీ పరిస్థితులను గమనించి చలించి... బెదిరిపోయి. జీవితం సుఖపడడానికీ భయపడి చావడానికీ కాదుకదా ఎంత ఆడజన్మయినా?

నేనే కాదు. నాలాటి ఆడపిల్ల లెందరో నాలాగే ఆలోచిస్తున్నారు. కొంచెం చదువూ కాస్త తెలివీ, ప్రపంచ జ్ఞానమూ ఉంటే...

కాని - పెద్దవాళ్లొప్పుకోరే!

ఛాదస్తంగా... అమాయకంగా... అతిమంచిగా... ఆలోచిస్తూ - ఎంతబెంతట తమ ఆడపిల్లకి అత్తారింటికి దారి చూపించి అంపకం పెట్టేస్తామా అని ఆరాట పడిపోతారు.

అంతే తప్ప-

ఇప్పుడు-

అత్తారింటికి దారెన్ని ఆపదల మయమో... అపాయాల నిలయమో... ఆ దారిలో-

ధనదాహంతో నోరు తెరచుకుని- అమాయకపు కొత్త పెళ్లి కూతురిని కబళించాలని ఎదురు చూసే ఎన్ని భయంకర పిశాచాలుంటాయో...

ఆ దారినిండా-

ఆమెపై కురుకుదామని కాచుకు కూచునే ఘోరాలెన్నుంటాయో... అవేవీ ఆలోచించరు పట్టించుకోరు.

ఇప్పుడు-

ఆడపిల్ల పెళ్లి-

అత్తారింటికి అందమయిన దారి కానేకాదనీ, అగ్ని ప్రవేశం మాత్రమే అనీ-

వార్తాపత్రికలలో వేలకొద్దీ హృదయవిదారక సంఘటనలు చదువుతూనే ఉన్నా వాటిలోని వాస్తవికతనూ సూచననీ గ్రహించరు.

పెళ్లి పీటల కావల పొంచి ఉన్న ప్రాణాంతకపు పరిస్థితుల నాకళింపు చేసుకోరు.

బామ్మగారూ!

ఈ రోజులు మీరోజులు కావు. ఆ మంచి రోజులు - మళ్లీ వొస్తాయో రావో తెలియనంత వెనక్కి వెళ్లిపోయాయి.

ఈ మనసులు - మీ కాలపు మంచి మనసులు కావు. తరాలు గడుస్తూంటే - చదువు పెరిగింది.

నాగరికతా పెరిగింది.

కాని- దురదృష్టవశాత్తూ-

మనుషులలో ధనదాహమూ స్వార్థమూ కూడా పెరిగి పోయాయి. సంస్కారమూ మానవత్వమూ క్షీణించి పోతున్నాయి.

నేటిమనుషులు-

సహజీవన సౌందర్యాన్ని సౌభాగ్యాన్నీ అర్థం చేసుకోలేని అధమ స్థితికి దిగజారిపోతున్నారు.

అందుకే - ఆడపిల్లకి అత్తవారిల్లు నరక కూపమే ఔతూందిప్పుడు. వైవాహిక జీవితం క్షణక్షణ గండమే ఔతూందామెకు.

అమ్మాయి అత్తారింటికి వెళ్లే దారిలో నోరు తెరుచుకుని కూర్చున్న - వరకట్న భూతాన్నీ కానుకల పిశాచాలనీ, కోరికల దెయ్యాలనీ - చిల్లర మల్లర పల్లేరు కాయలనీ పారద్రోలే వరకూ-

పెద్దలూ, యువకులు చిత్తశుద్ధి తోనూ పట్టుదలతోనూ యీదారిని సుకరమూ సుగమమూ గావించేవరకూ-

ఆడపిల్లకి చూపించవలసినది - అత్తారింటికి దారి కాక - ఆమె స్వతంత్రంగా బతకగలిగే మార్గమే. పరిస్థితులను బట్టి మనుషులు మారకుండా పాత పద్ధతిలోని ఆడపిల్లకిప్పుడూ అత్తారింటికే దారి చూపబోతే,

ఆ అమాయకపు అమ్మాయిని వధ్య శిలవేపు నడిపించడమే ఔతుందేమో ఒక్కసాలోచించండి" అని చెప్పాలనిపించింది.

కానీ చెప్పి ప్రయోజనం ఏమిటి? ఎవరు వింటారీ మాటలు...అంతెందుకు తన యింట్లో తన తల్లిని 'కన్విన్స్' చెయ్యగలదా యివి చెప్పి? లేదే? నిశ్శబ్దంగా మనసులోని భావాలని మనసులోనే అణగద్రొక్కి లోపలికి వెళ్లిందిచి. సుజాత.

## వనిత చిట్కా

టమేటో సాస్ సీసా ఖాళీ అయిపోయిందని అవతల పారేయకండి. ఆ సీసాలో కొంచెం 'వెనిగార్' వేసి బాగా కలిపి వండిన ఏ కూరకయినా దానిని కలపండి. ఆ కూరకి నోరూరించే రుచి వస్తుంది.